సాక్షి చిత్తూరు

ఆదివారం । 19 । నవంబర్ । 2023



బోసి నవ్వుకు భరోసా!
నవజాత శిశువుల రక్షణకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ అమలు చేస్తోంది. - 8లో



సాహిత్యంపై అవగాహన అవసరం
నేటి తరం పిల్లలకు సాహిత్యంపై అవగాహన అవసరమని చైతన్య సాహితీ సమితి అధ్యక్షుడు నాగిరెడ్డి తెలిపారు. - 8లో



పకడ్బందీగా కుల గణన
కుల గణన ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు ఆదేశించారు. - 8లో

న్యూస్‌రీల్

ఓటు హక్కు పౌరుల బాధ్యత



దరఖాస్తు అందిస్తున్న న్యాయమూర్తి కరుణకుమార్

చిత్తూరు అర్బన్: ఓటు హక్కు పొందడం పౌరుల బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణ కుమార్ స్పష్టం చేశారు. ఓటు నమోదు కోసం ఆయన శనివారం దరఖాస్తు చేసుకున్నారు. చిత్తూరు నియోజకవర్గ ఈఆర్‌ఓ, ఆర్డీఓ చిన్నయ్య, ఏఈఆర్‌ఓ, కమిషనర్ జె.అరుణకు ఆయన పూర్తి చేసిన ఫారం–6 అందించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ఓటు హక్కు నమోదు, ఓటు వినియోగంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన వారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఓటు నమోదుపై ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎంఎం గోపీ పాల్గొన్నారు.

తిరుచ్చిపై ప్రసన్నుడి చిద్విలాసం



ఊరేగుతున్న దేవదేవేరులు

పుత్తూరు: మండలంలోని అప్పలాయిగుంటలో వెలసిన శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామివారు శనివారం తిరుచ్చిపై కొలువు దీరి పురవీధుల్లో విహరించారు. ఈ సందర్భంగా వేకువనే శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు సమర్పించారు. సాయంత్రం పట్టు పీతాంబరాలు, స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామిని సుందరంగా అలంకరించి ఊయలలో కొలువు దీర్చారు. భక్తి కీర్తనల నడుమ కనులపండువగా ఊంజల్ సేవ జరిపించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై ఊరేగారు.

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి తుడా : స్విమ్స్ శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ఆస్పత్రిలో పలు పోస్టులకు వాక్ ఇన్ ఇంటర్వ్యూను నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణ బిట్ల తెలిపారు. వివిధ కేటగిరీ కాంట్రాక్ట్ పోస్టులకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అందులో మెడికల్ ఆఫీసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 22న, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలకు 23న, పారామెడికల్, పీఆర్‌ఓ, ఎంఎస్‌డబ్ల్యూ పోస్టులకు 27న, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎలక్ట్రిషియన్, డ్రైవర్ పోస్టులకు 28 వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు.

పవిత్రం..పునీతం



పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరిస్తున్న అశేష భక్తులు (ఇన్‌సెట్) చక్రత్తాళ్వార్‌కు స్నానమాచరింపజేస్తున్న అర్చకులు, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి



అమ్మవారికి సమర్పించిన ఆభరణాలను చూపుతున్న టీటీడీ చైర్మన్, ఈఓ

సిరులతల్లి కరుణాకటాక్ష వీక్షణాల కోసం భక్తకోటి తరలివచ్చింది.. పల్లకిపై ఊరేగుతున్న పద్మావతీదేవిని దర్శించుకుని పులకించింది.. అమ్మ ఆవిర్భవించిన పద్మసరోవరంలో నిర్వహించిన పంచమీ తీర్థంలో పాలుపంచుకుని పరవశించింది. పవిత్ర పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరించి పునీతమైంది.

- అంగరంగ వైభవంగా శ్రీపద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాలు
- ఆగమోక్తంగా పంచమీ తీర్థం
- భక్తులతో కిక్కిరిసిన పద్మసరోవరం
- శ్రీవారి తరఫున సారె సమర్పించిన టీటీడీ చైర్మన్ భూమన

చంద్రగిరి(తిరుచానూరు) : శ్రీపద్మావతి అమ్మవారు ఆవిర్భవించిన పద్మసరోవరంలో శనివారం పంచమి తీర్థాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం పల్లకీ ఉత్సవం అనంతరం అమ్మవారు, చక్రత్తాళ్వార్లను సన్నిధి నుంచి వేంచేపుగా పుష్కరిణిలోని పంచమీతీర్థం మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అమ్మవారు, చక్రత్తాళ్వార్లకు నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పుట్టిన రోజు కానుకగా అమ్మవారికి శ్రీవారు పంపించిన ఆభరణాలను అలంకరించారు. అనంతరం 12.10 గంటలకు ధనుర్లగ్నంలో పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా ఆలయ అర్చకులు పుష్కరిణిలో చక్రత్తాళ్వార్లకు చక్రస్నానం నిర్వహించారు. అప్పటికే వేచి ఉన్న వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు.

పంచమీ తీర్థం..వైభవోపేతం

పంచమితీర్థ మహోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించినట్టు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. సుమారు 50 వేలమందికిపై భక్తులు అమ్మవారి పద్మసరోవరంలో పుణ్యస్నానాలు ఆచరించారన్నారు. ఈఓ ధర్మారెడ్డి నేతృత్వంలో అమ్మవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు వెల్లడించారు. అన్ని విభాగాల సిబ్బంది విశేషంగా కృషి చేశారని ప్రశంసించారు. ఈఓ ధర్మారెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, జేఈఓలు వీరబ్రహ్మం, సదాభార్గవి, సీవీఎస్‌ఓ నరసింహ కిషోర్, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, ఎస్వీబీసీ సీఈఓ షణ్ముఖకుమార్, సీఈ నాగేశ్వర రావు, డిప్యూటీ ఈఓలు గోవిందరాజన్, లోకనాథం పాల్గొన్నారు.



ప్రత్యేక పుష్పాలంకరణలో అమ్మవారు, చక్రత్తాళ్వార్

సారె సమర్పణ



సారె తీసుకువస్తున్న టీటీడీ చైర్మన్ భూమన తదితరులు

తిరుమల: కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీపద్మావతి అమ్మవారికి శ్రీవారి ఆలయం నుంచి సారె సమర్పించడం ఆనవాయితీ. అందులో భాగంగా శనివారం వేకువజామున శ్రీవారి వక్షఃస్థల లక్ష్మీ అమ్మవారికి ఏకాంతంగా తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 4.30 గంటలకు తిరుమల శ్రీవారి ఆలయం నుంచి పసుపు, కుంకుమ, ప్రసాదాలు, తులసి, వస్త్రాలు, ఆభరణంతో కూడిన సారెను ఊరేగింపుగా కాలినడకన తిరుపతిలోని అలిపిరి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి ఆభరణాలతో కూడిన శ్రీవారి సారెను జేఈఓ వీరబ్రహ్మంకు అందజేశారు. అనంతరం కోమలమ్మ సత్రం, కోదండరామాలయం, శ్రీ గోవిందరాజస్వామి ఆలయం, లక్ష్మీపురం సర్కిల్, శిల్పారామం మీదుగా తిరుచానూరు పసుపు మండపానికి సారెను తీసుకొచ్చారు. ప్రత్యేక పూజల నంతరం ఆలయ మాడవీధుల గుండా ప్రదక్షిణగా వెళ్లి పద్మపుష్కరిణి వద్ద అమ్మవారికి సారెను సమర్పించారు. టీటీడీ చైర్మన్, ఈఓ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆలయం నుంచి రూ.2.5 కోట్ల విలువైన 5 కిలోల బంగారు కాసుల హారం, యజ్ఞోపవీతాన్ని అమ్మవారికి కానుకగా సమర్పించినట్టు తెలిపారు.

జగనన్నతోనే బడుగుల అభ్యున్నతి



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : బడుగుల అభ్యున్నతి జగనన్నతోనే సాధ్యమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి స్పష్టం చేశారు. శనివారం పుత్తూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. అవినీతి కేసుల్లో చిక్కుకున్న చంద్రబాబు చివరకు రోగాల పేరు చెప్పి బయటపడేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఎల్లో మీడియాలో ఎంతగా అసత్య ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మరని, అభివృద్ధిని చూసే ఓట్లు వేస్తారని వెల్లడించారు. అంబేడ్కర్ భావజాలం ఉన్నవారు చంద్రబాబుకు ఎప్పటికీ అండగా ఉండరని తెలిపారు. జగనన్న పేదల పక్షాన నిలబడితే, చంద్రబాబు పెత్తందార్ల వైపు ఉన్నారని విమర్శించారు. జగనన్నకు ప్రజా మద్దతు ఉందని స్పష్టం చేశారు.

ధీరజ్ సేవలు మరువలేం



ధీరజ్ తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కట్టమంచి ధీరజ్‌రెడ్డి సేవలు మరువలేమని, ఆయన లేని లోటు తీరనిదని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం చిత్తూరులో ధీరజ్ కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమం.. అభివృద్ధి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్ : ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అర్హులందరికీ అందిస్తున్నామని, ఇదే స్ఫూర్తితో ప్రజాప్రతినిధులు, అధికారులు మరింతగా కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం చిత్తూరులోని జెడ్పీ కార్యాలయంలో జిల్లా స్థాయీ సంఘాల సమావేశం నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. పుంగనూరులో ఎలక్ట్రికల్ బస్సు పరిశ్రమకు త్వరలోనే శంకుస్థాపన చేయనున్నట్లు వెల్లడించారు. కుప్పానికి హంద్రీ–నీవా జలాలను అందించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్యారంగం అభివృద్ధికి రూ.65 వేల కోట్లు వెచ్చించారని వెల్లడించారు. జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన నాలుగు కరువు మండలాల్లో 50 శాతం ఉపాధి పనిదినాలు పెంచినట్లు వివరించారు. స్త్రీ శిశు సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్మన్ భారతి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి మాట్లాడుతూ ఏపీఎంఐపీ ద్వారా ఈ ఏడాది 500 హెక్టార్లలోని పంటలకు డ్రిప్ పరికరాలు అందించినట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ వారంలోపు 3 బీఎంసీయులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య మాట్లాడుతూ బడుగుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. డీఈఓ విజయేంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ రవి, డ్వామా పీడీ గంగాభవానీ, డీపీఓ లక్ష్మి, డీఎల్‌డీఓ రవికుమార్ పాల్గొన్నారు.

కి'లేడీ' అరెస్ట్ - రూ.15లక్షల విలువైన బంగారు నగల స్వాధీనం


నిందితురాలి అరెస్ట్ చూపుతున్న పోలీసులు, రాధిక

చిత్తూరు అర్బన్: బస్సు ప్రయాణీకులతో రద్దీగా ఉంటే ఆమె పంట పండినట్టే. నలుగురిలో కలిసిపోయి బస్సు ఎక్కి.. ఎవరికీ అనుమానం రాకుండా చోరీలకు పాల్పడుతుంది. చాకచక్యంగా విలువైన వస్తువులు అపహరించే బి.రాధిక(27) అనే కిలాడీ మహిళను శనివారం చిత్తూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితురాలి నుంచి సుమారు రూ.15 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు చిత్తూరులోని పోలీసు అతిథిగృహంలో నగరి డీఎస్పీ రవికుమార్, కార్వేటినగరం సీఐ సత్యబాబు, ఎస్ఆర్ పురం ఎస్ఐ షేక్‌షావలీ మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈనెల 13వ తేదీన పుత్తూరు నుంచి బెంగళూరు వెళ్లే ఆర్టీసీ బస్సులో ఎస్ఆర్ పురం మండలం పుల్లూరు క్రాస్ వద్ద అనసూయ అనే మహిళ ఎక్కింది. ఆమె తన బ్యాగులో నల్లపూసల దండ, రాళ్ల నెక్లెస్, ఏడు ఉంగరాలు, గాజులు, బ్రాస్‌లెట్, కమ్మలు, వాచీ, పగడాల దండతో పాటు మొత్తం 19 బంగారు ఆభరణాలు ఉన్నాయి. బస్సు చిత్తూరు నగరంలోని ఎస్టేట్ సమీపంలోకి రాగానే అనుసూయకు అనుమానం వచ్చి బ్యాగును చూసుకుంటే కనిపించలేదు. కంగారుపడి బస్సు మొత్తం వెతికినా దొరకలేదు. దీంతో వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయిస్తే కేసు ఎస్ఆర్ పురం పరిధిలోకి వస్తుందని చెప్పడంతో అక్కడకు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఎస్ఐ షేక్‌షావలీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలను పరిశీలించిన పోలీసులు అనుమాస్పదంగా అనసూయ సమీపంలో సంచరించిన ఓ మహిళను గుర్తించారు. శనివారం కొత్తపల్లెమిట్ట చర్చి వద్ద అనుమానితురాలు తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. చిత్తూరు నగరంలోని ఓబనపల్లె లెనిన్‌నగర్‌కు చెందిన శంకర్ భార్య రాధిక ఇదే విధంగా పలు చోరీలకు పాల్పడినట్లు వెల్లడైంది. ఈ క్రమంలోనే అనుసూయ బ్యాగు కొట్టేసి గంగాధరనెల్లూరు మండలం ఠాణా కూడలి వద్ద బస్సు దిగినట్లు తెలిసింది. అపహరించిన సొత్తును విక్రయించడానికి ప్రయత్నిస్తూ పోలీసులకు దొరికిపోయింది. బాధితురాలు పోగొట్టుకున్న మొత్తం 262.98 గ్రాములను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. నిందితురాలిపై ఇప్పటికే పూతలపట్టు, కల్లూరు, కాణిపాకం, గుడిపాల, సోమల, చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదైనట్లు వెల్లడించారు.

బోసి నవ్వుకు భరోసా!

పసికందుల బోసి నవ్వులకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. నవజాత శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించింది. అమ్మ గర్భంలో ఉన్నప్పటి నుంచే పసిగుడ్డు రక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. మాతాశిశు మరణాల నివారణకు విశేషంగా కృషి చేస్తోంది. తల్లీబిడ్డల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా వైద్యఆరోగ్యశాఖకు దిశానిర్దేశం చేసింది. అందులో భాగంగా నవజాత శిశు వారోత్సవాలకు శ్రీకారం చుట్టింది. క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై గర్భిణులకు అవగాహన కల్పిస్తోంది.

- నవజాత శిశువు రక్షణకు చర్యలు చేపట్టిన ప్రభుత్వం
- పసిగుడ్డు నుంచి మెరుగైన వైద్యం
- మాతాశిశు మరణాల కట్టడే ధ్యేయం
- వారోత్సవాల్లో అవగాహనకు శ్రీకారం


జిల్లా ఆస్పత్రిలోని చిన్న పిల్లల వార్డులో శిశువులకు చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది (ఫైల్)

చిత్తూరు రూరల్ : నవజాత శిశువులను అత్యంత జాగ్రత్తగా చూసుకోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా నెలలు నిండక ముందే పుట్టినవారైతే మరింత అప్రమత్తంగా కాపాడుకోవాల్సి అవసరముంది. ఇన్‌ఫెక్షన్ బారిన పడకుండా కంటికి రెప్పలా రక్షించుకోవాల్సి ఉంటుంది. సమస్య మొదలవుతున్నప్పుడే గుర్తించి, చికిత్స ఆరంభించేందుకు బిడ్డను నిరంతరం కనిపెట్టుకుని ఉండటం ఎంతైనా అవసరం. అయితే ఇది అన్నిసార్లు సాధ్యపడకపోవచ్చు. అందుకే ప్రభుత్వం పసిగుడ్డు ప్రాణాలకు ఊపిరి పోసేలా వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. మాతాశిశు మరణాలను అరికట్టేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోంది. ఈక్రమంలో ఈనెల 15వ తేదీ నుంచి నవజాత శిశు వారోత్సవాలను ప్రారంభించింది. ఈ మేరకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

నిరంతరం పర్యవేక్షణ

ప్రభుత్వాస్పత్రుల్లో సుఖ ప్రసవాల కోసం వైద్య ఆరోగ్యశాఖ విశేషంగా కృషి చేస్తోంది. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు అయ్యే వరకు అండగా నిలుబడుతోంది. నవజాత శిశు సంరక్షణకు సూచనలిస్తోంది. ముఖ్యంగా గర్భిణుల నమోదు నుంచి నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించడం, అన్ని రకాల పరీక్షలు చేయించడం, రక్తహీనత అధిగమించేందుకు ఐరన్, సుక్రోజ్ అందజేయడం, హైరిస్క్ కేసులను ముందుగానే గుర్తించడం, సుఖప్రసవానంతరం పురిటి బిడ్డ ఆరోగ్యస్థితిగతులను పరిశీలించడం చేపడుతోంది. ఈ క్రమంలో చిన్నపిల్లల వార్డుల్లో అన్ని వసతులు కల్పించింది. అధునిక పరికరాలను అందుబాటులో ఉంచింది. నియోనాటల్ 108 అంబుల్సెల సేవలను అందిస్తోంది.

అవగాహన ఇలా..

నవజాత శిశు వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.. ర్యాలీలు, పౌష్టికాహారం, ప్రసవం, తల్లిపాలు పట్టడం, నాటు వైద్యం, చిన్న పిల్లల పట్ల జాగ్రత్త, వ్యాధులు, ప్రభుత్వ వైద్య సేవలు తదితర అంశాలను వివరిస్తున్నారు. ఈనెల 21వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగించనున్నారు.

జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి :	01
సీహెచ్‌సీలు :	07
ఏరియా ఆస్పత్రులు :	04
ప్రైవేట్ హాస్పిటళ్లు :	సుమారు 2వేలు

ప్రసవం, శిశు మరణాల వివరాలు

నెల	ప్రసవాల సంఖ్య	మరణాల సంఖ్య
జూలై	2,841	12
ఆగస్ట్	3,230	12
సెప్టెంబర్	3,002	18
అక్టోబర్	3,018	22

లక్షణాలను కనిపెడితే..

నవజాత శిశువు మరణానికి ప్రధాన కారణం ఇన్‌ఫెక్షన్ అని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నెలలు నిండక ముందే పుట్టే పిల్లల్లో ఇన్‌ఫెక్షన్ ముప్పు అధికంగా ఉంటుందని చెబుతున్నారు. గుండె వేగంగా కొట్టుకోవడం, శ్వాస వేగంగా తీసుకోవడం, పాలు తాగలేకపోవడం, కాలేయం వాపు తదితర లక్షణాలను ఉంటాయని, వీటిని ముందుగా కనిపెడితే ముప్పు తప్పించవచ్చని సూచిస్తున్నారు. సకాలంలో చికిత్స అందిస్తే బిడ్డను కాపాడుకోవచ్చు వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా చలికాలంలో నవజాత శిశువులను శ్వాసకోస సమస్యలు వేధిస్తాయని హెచ్చరిస్తున్నారు. పుట్టుకతో వచ్చే అసాధారణతలు , బొడ్డు తాడును కట్ చేయడానికి నాన్ స్టైరైడ్ సాధనాలను ఉపయోగించడం , బొడ్డు స్టంప్‌ను కప్పడానికి కలుషితమైన పదార్థాన్ని వాడడం, విరేచనాల కారణంగా సంభవించే నియోనాటల్ టెటానస్ వంటివి నవజాత శిశువుల మరణానికి ప్రధాన కారణాలని వివరిస్తున్నారు.

బిడ్డ రక్షణకు తల్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- గర్భం దాల్చినప్పటి నుంచి వైద్యుల సలహాలు పాటించాలి
- వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి
- బిడ్డకు తల్లిపాలు పట్టాలి
- సకాలంలో టీకాలు వేయించాలి
- బిడ్డను పుట్టినప్పటి నుంచి 5 ఏళ్ల వరకు కంటికి రెప్పలా చూసుకోవాలి



జాగ్రత్తలు అవసరం



గర్భం దాల్చినప్పటి నుంచి మహిళలు జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. మందులతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలి. మూడో నెల నుంచి ప్రసవించే వరకు సక్రమంగా వైద్య సేవలు పొందాలి. అప్పుడే బిడ్డ ఎదుగుదల సైతం బావుంటుంది. వ్యాధులు రాకుండా ఉంటాయి. తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారు. శిశువుకు టీకాలను సైతం సకాలంలో అందించాలి. నవజాత శిశువు విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదు.

– రవిరాజు, డీఐఓ

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

కుప్పంరూరల్ : పట్టణ సమీపంలోని చెన్నై– బెంగళూరు రైల్వే మార్గంలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగరాజు మాట్లాడుతూ సుమారు 55– 60 ఏళ్ల వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడని, మృతుడి ఒంటిపై సిమెంట్ రంగు స్వెటర్, సిమెంట్ కలర్ ప్యాంటు ఉందని వెల్లడించారు. మృతదేహాన్ని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పలమనేరు : పట్టణంలోని గాంధీనగర్ వద్ద చెన్నై– బెంగళూరు జాతీయరహదారిపై కారు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు.. గంగవరం మండలం బండమీద జరావారిపల్లెకు చెందిన మునస్వామిరెడ్డి (73) మొగిలి ఫారెస్ట్‌లో పశువుల కాపరిగా ఉంటున్నాడు. ఈ క్రమంలో హైవే దాటుతుండగా బెంగళూరుకు చెందిన కారు వేగంగా ఢీకొంది. వృద్ధుడి మృతదేహాన్ని కొద్ది దూరం ఈడ్చుకుంటూ వెళ్లింది. కారు డ్రైవర్ వెంటనే పోలీసుల దగ్గరు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వృద్ధుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు

పలమనేరులోని గంటావూరు బీసీ కాలనీకి చెందిన జ్యోతిక(19) తన తల్లి జయంతి(40)తో కలసి స్కూటీపై షాపింగ్‌కు బయలుదేరింది. మలుపులో స్కూటీని నిలిపి ఉన్న సమయంలో ఓ ప్రైవేటు బస్సు ఢీకొంది. దీంతో తల్లీకూతుళ్లు ఇరువురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారిస్తున్నారు.

పకడ్బందీగా కుల గణన

కార్వేటినగరం: కుల గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నరసింహులు ఆదేశించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో కుల గణనపై శిక్షణ కల్పించారు. ఈడీ మాట్లాడుతూ కుల గణనను ప్రతిష్టాత్మకంగా పూర్తి చేసి కచ్చితమైన నివేదిక అందించాలని సూచించారు. గణనను యాప్‌లో అప్‌లోడ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు విధి విధానాలను వివరించారు. కుల గణన ప్రక్రియ ఈ నెల 27న ప్రారంభమై డిసెంబర్ 10వ తేదీకి ముగుస్తుందన్నారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఎంఈఓ–2 మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

రామకుప్పం: మండలంలోని రాజనాలబండ అటవీప్రాంతంలో శుక్రవారం రాత్రి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. కవ్వంపల్లెకు చెందిన సోమశేఖర్‌కు కర్ణాటకలోని బిల్లేరిపల్లెకు చెందిన కాంతమ్మ కుమార్తె సౌమ్యకు ఆరు నెలల క్రితం వివాహం నిశ్చయమైంది. అయితే సౌమ్య మైనర్ కావడంతో మేజర్ అయిన తర్వాత పెళ్లి చేయాలని ఇరు కుటుంబాలవారు నిర్ణయించారు. అప్పటి నుంచి సోమశేఖర్ బిల్లేరిపల్లెకు తరచూ రాకపోకలు సాగించేవాడు. కాబోయే భార్య కుటుంబీకులతో చనువుగా ఉండేవాడు. ఈ మేరకు వారు ఇల్లు నిర్మించుకుంటుంటే ఆర్థికసాయం కూడా అందించాడు. ఈ క్రమంలో శుక్రవారం బిల్లేరిపల్లెకు వెళ్లిన సోమశేఖర్ రాత్రి అయినా ఇంటికి తిరిగిరాలేదు. శనివారం ఉదయం ఓ చెట్టుకు ఉరివేసుకుని మృతదేహంగా కనిపించాడు. దీనిపై మృతుడి తండ్రి ముని వెంకటప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సౌమ్య తమ కుమారుడితో పెళ్లికి నిరాకరించడం వల్లే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

సాహిత్యంపై అవగాహన అవసరం

చిత్తూరు కార్పొరేషన్: సాహిత్యంపై నేటి తరానికి అవగాహన అవసరమని చైతన్య సాహితి సమితి అధ్యక్షుడు నాగిరెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థలో వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాహిత్య సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి భాషలోని గొప్పదనాన్ని సాహిత్యం ద్వారా తెలుసుకోవచ్చన్నారు. వినియోగదారుల హక్కులు, ఉచిత సేవల గురించి జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడు సలీమ్ తెలియజేశారు. అనంతరం సాహితవేత్తలను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి రామకృష్ణ, పీసీఆర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ రమేష్, గ్రంథాలయాధికారులు లలిత, మధుబాబు, పూర్ణిమ, తులసి, కుమార్, దేవీబాల పాల్గొన్నారు.